## క్లుప్తంగా

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 4న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. హనుమకొండ చౌరస్తా, కాకాజీకాలనీ, హనుమకొండ జిల్లా బస్‌స్టేషన్ రోడ్, అలంకార్ కూడలి, గాంధీనగర్, టైలర్ స్ట్రీట్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

### రుణమాఫీ వర్తింపజేయాలి

కాజీపేట అర్బన్ : రుణమాఫీని రైతులందరికీ వర్తింపచేయాలని సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ బావుసింగ్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఎన్నికల వేళలో రైతులందరికీ రుణమాఫీ చేపడుతామని హామీ ఇచ్చి ప్రభుత్వంలోకి వచ్చిన తర్వాత కేవలం 40 శాతం మందికి వర్తింపచేయడం సరైన పద్ధతి కాదని సీపీఎం మండల నాయకుడు రమేష్ తెలిపారు. మదన్‌చారి, సాంబయ్య పాల్గొన్నారు.

### డ్రంకెన్‌డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

రామన్నపేట : వరంగల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ దేశాయిపేట, ఎన్టీఆర్ నగర్‌కు చెందిన సామల కట్టమల్లు, వరంగల్‌లోని బంధంపల్లికి చెందిన కొత్తూరు మధుకర్‌లకు రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ వరంగల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి మంగళవారం తీర్పు వెల్లడించినట్లు వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ తెలిపారు. అలాగే డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ మిగతా 24 మందికి రూ.41,100 జరిమానా, లైసెన్స్ లేకుండా వాహనం నడుతూ పట్టుబడిన నలుగురికి రూ.5 వేలు జరిమానా విధించినట్లు వివరించారు.

### సాయం అభినందనీయం

హన్మకొండ అర్బన్ : వరద బాధితులకు తెలంగాణ జేఏసీలోని ప్రభుత్వ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సెప్టెంబర్ నెల వేతనంలో తమ ఒక రోజు మూలవేతనాన్ని సీఎం సహాయ నిధికి మినహాయించుకోవాల్సిందిగా ముఖ్య మంత్రిని కోరడాన్ని హనుమకొండ జిల్లా టీఎన్జీవోస్ యూనియన్ అభినందిస్తున్నట్లు అధ్యక్షుడు ఆకుల రాజేందర్ పేర్కొన్నారు. బాధితులకు ప్రభుత్వ ఉద్యోగులు అండగా నిలిచి సహాయ సహకారాలు అందిస్తామని వివరించారు.

### బాధితులను ఆదుకోవాలి

దేశాయిపేట: భారీ వర్షాలు వరదల బీభత్సంతో కష్టాల పాలైన వారందరినీ అన్ని విధాలా ఆదుకోవాలని బీకేఎంయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్షాలతో లోతట్టు ప్రాంతాలకు నీరు వచ్చి పలు కాలనీలు, గ్రామాలు జలమయం అయ్యాయని, అనేక ఇళ్లు కూలిపోయి సర్వస్వం కోల్పోయిన వారి బాధలు వర్ణనాతీతమన్నారు. బీభత్సాన్ని కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించి తక్షణ సహాయంగా రూ. రెండు వేల కోట్లు అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణసాయంగా ప్రతి బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేయాలని కోరారు.

### ఇళ్లలో ఉపయోగం లేని వస్తువులు తెచ్చి ఇవ్వాలి

కాజీపేట : మనకు ఇళ్లలో ఉపయోగం లేని అన్ని రకాల బట్టలను ఇక్కడకు తెచ్చి ఇవ్వాలని ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్‌రావు అన్నారు. స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ) ఆవరణలో మంగళవారం వాల్ ఆఫ్ కైండ్‌నెస్ సంస్థను ప్రిన్సిపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులు, పట్టణ ప్రజలు తమకు ఉపయోగంలేని వస్తువులను ఇక్కడకు తెస్తే నిరుపేదలు ఉపయోగించుకుంటారన్నారు. కార్యక్రమంలో చక్రవర్తి, గీత, అనిల్, లత, రవివర్మ, యశోద, తదితరులు పాల్గొన్నారు

### దర్గాలో ఎల్లమ్మ బోనాలు



కాజీపేట రూరల్ : దర్గాలో ఎల్లమ్మతల్లి బోనాల పండుగను భక్తులు భక్తిశ్రద్ధలతో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి మహిళలు డప్పుచప్పుళ్లతో బోనాలు ఎత్తుకొని నృత్యాలు చేసుకుంటూ గాంధీ సెంటర్ వద్దకు చేరుకున్నారు. గుడి వద్దకు వెళ్లి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కార్పొరేటర్ మాసన రాంప్రసాద్, మాజీ కార్పొరేటర్ అబుబక్కర్, గౌడ సంఘం, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### గోడ నిర్మాణంపై ఫిర్యాదు

కాజీపేట రూరల్ : 47వ డివిజన్ బోడగుట్టలో ఓ వ్యక్తి సీసీ రోడ్డును పగులగొట్టి అక్రమంగా గోడ నిర్మాణం చేపడుతున్నాడని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు మంగళవారం గంగుల రాజిరెడ్డి తెలిపారు. వలిశెట్టి శ్రీనివాస్ రోడ్డును పగులగొట్టి గోడ నిర్మాణం చేస్తూ స్థానిక ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నాడని రోడ్డుకు అడ్డంగా ఎలాంటి నిర్మాణం లేకుండా చూడాలని అధికారులను కాలనీ వాసులందరం కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

# రేషన్‌షాపులపై టాస్క్‌ఫోర్స్‌దాడి

- స్టాక్ నిల్వలు పరిశీలించిన అధికారులు

ఖిలా వరంగల్: రేషన్‌షాపులపై క్వాలిటీ కంట్రోల్ సివిల్ సప్లయీస్ హైదరాబాద్, స్టేట్ టాస్క్‌ఫోర్స్ అధికారుల ఆధ్వర్యంలో దాడులు జరిగాయి. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏనుమాముల సివిల్ సప్లయీ గోదాంతో పాటు వరంగల్, ఖిలావరంగల్ మండలలోని చౌకధరల దుకాణాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ (డీటీ) కిరణ్‌కుమార్‌తో కలిసి స్పెషల్ టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పలు షాపుల్లో బియ్యం నిల్వలు, పంపిణీ విధానం, డీలర్ ఆథరైజేషన్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ అధికారులు మాట్లాడుతూ గోదాం, రెండు మండలలోని పలు రేషన్‌షాపులను తనిఖీ చేసి రికార్డుల ప్రకారం నిల్వలను పరిశీలించామని తెలిపారు. మరో రెండు రోజుల పాటు హనుమకొండ, వరంగల్ జిల్లాలో పర్యటించి షాపుల్లో పంపిణీ విధానాన్ని పరిశీలిస్తామని అధికారులు పేర్కొన్నారు. దాడుల్లో క్వాలిటీ కంట్రోల్ సివిల్ సప్లయీ మేనేజర్ హైదరాబాద్ ఎంఎ రశీద్, స్టేట్ టాస్క్‌ఫోర్స్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఖిలావరంగల్: రేషన్‌షాపును తనిఖీ చేస్తున్న స్పెషల్ టాస్క్‌ఫోర్స్ అధికారులు

హసన్‌పర్తి : మండలంలోని చింతగట్టు, హసన్‌పర్తి గ్రామాల్లోని రెండు రేషన్ షాపులను విజిలెన్స్ కమిటీ సభ్యులు మంగళవారం తనిఖీ నిర్వహించారు. రేషన్‌షాపుల్లోని రికార్డులను పరిశీలించారు. ప్రతినెలా ఎంత మంది లబ్ధిదారులకు బియ్యం అందిస్తున్నారని అడిగారు. మిల్లర్ల నుంచి ఎఫ్‌సీఐకి ఏ రకమైన బియ్యం సరఫరా చేస్తున్నారు. అవే బియ్యం రేషన్‌షాపులకు చేరుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి నెలా ఎన్ని రోజులు షాపులు తెరిచి ఉంటాయని అడిగి తెలుసుకున్నారు..

**తక్కువ తూకం**



హసన్‌పర్తి : రేషన్ షాపును తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

తనిఖీలకు వచ్చిన విజిలెన్స్ అధికారులకు డీలర్లు తమ గోడును వెలిబుచ్చుకున్నారు. ఎఫ్‌సీఐ ద్వారా రేషన్ షాపులకు వచ్చే బియ్యం తక్కువగా వస్తుందన్నారు. 50 కిలోల బస్తాకు కిలో నుంచి కిలోన్నర వరకు తూకం తక్కువగా ఉంటుందన్నారు. ఒక్కో షాపునకు 80 క్వింటాళ్ల నుంచి 100 క్వింటాళ్ల వరకు బియ్యం ఎఫ్‌సీఐ ద్వారా దిగుమతి అవుతుందన్నారు. బియ్యం తక్కువగా రావడంతో తాము ఆర్థిక భారాన్ని భరించాల్సి వస్తోందని డీలర్లు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. తనిఖీల్లో ఆర్ఐ ఫాజిల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ముందస్తు జాగ్రత్తలతో ప్రమాదాల నివారణ

వరంగల్: సమాజంలోని మహిళలు, విద్యార్థినులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలను నివారించవచ్చని షీ టీం హెడ్ కానిస్టేబుల్ సూర్యనారాయణ అన్నారు. వరంగల్ తిలక్‌రోడ్‌లోని స్కాలర్స్ ఉన్నత పాఠశాలలో మంగళవారం షీ టీం విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో అత్యాచారాలు, మానభంగాలు, వివిధ రకాల నేరాలు అరికట్టడం, ముందు జాగ్రత్త తీసుకోవడంలో మహిళలు, విద్యార్థులు, ప్రజలు తెలుసుకోవాల్సిన విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్ సంఘ వెంకట్రాజ్యం మాట్లాడుతూ మహిళల అమాయకత్వమే నేరస్తులకు బలం చేకూరుస్తుందన్నారు. తమపై అత్యాచారం జరుగుతున్న సమయంలో మహిళ



సదస్సులో మాట్లాడుతున్న చైర్మన్ వెంకట్రాజ్యం

అనే విషయాన్ని మరిచి ధైర్యంగా నేరస్తులను ఎదుర్కొవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ సంఘ జీవనజ్యోతి, ఇన్‌చార్జ్ నాంపల్లి అశోక్, షీ టీమ్స్ కానిస్టేబుళ్ల వంశీకృష్ణ, పూర్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా శ్రీనివాస్

వరంగల్ చౌరస్తా : తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా దుబ్బా శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం వరంగల్ మేదరవాడలోని ఓ ఫంక్షన్ హాల్‌లో తాజాగా ఎన్నికైన వారికి కన్వీనర్లు దుబ్బా శ్రీనివాస్, కార్యదర్శి మంగేటి అశోక్ కుమార్‌లకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనివాస్ మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా ఆర్యవైశ్యుల అభివృద్ధి కృషి చేస్తామని తెలిపారు. అంతేకాకుండా రాష్ట్ర కోశాధికారిగా గండె శ్రీనివాస్ గుప్తాతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గార్లపాటి శ్రీనివాస్, దాచేపల్లి సీతారాం, మంచాల కృష్ణమూర్తి, దొంతుల శోభన్, సూర్యదేవర రాజమౌళి, దుబ్బ నారాయణ, ఇమ్మడి శ్యాంబాబు, శ్రీరాం రవీందర్, ఎర్రం ప్రకాశం, పాల మురళీధర్, ఓలం సదాశివుడు, గార్లపాటి సంతోష్ పాల్గొన్నారు.



అధ్యక్షుడిగా నియామక పత్రాన్ని స్వీకరిస్తున్న దుబ్బా శ్రీనివాస్

## సాయం అందించకుండా ప్రతిపక్షాలపై దాడులు

- బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్

హన్మకొండ: ఖమ్మం జిల్లా వరదలతో అతలాకుతలమైతే ప్రజలను ఆదుకోవాల్సి పోయి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు తమ పార్టీ నాయకులచే ప్రతిపక్ష నాయకులపై దాడులు చేయించడం అమానుషమని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ పేర్కొన్నారు. వరదలతో నీట మునిగిన కాలనీలు, ఇబ్బంది పడుతున్న ప్రజలను పరామర్శించడానికి, నిరాశ్రయులకు అండగా నిలిచేందుకు వెళ్లిన మాజీ మంత్రులు హరీష్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై కాంగ్రెస్ గుండాలు దాడి చేయడాన్ని ఆయన ఒక ప్రకటనలో ఖండించారు. ఈ విపత్కర సమయంలో ప్రజలకు అండగా నిలిచి భరోసా కల్పించి, ఆదుకోవాల్సిన సమయంలో ప్రతిపక్షాలపై దాడులు చేస్తారా అని ప్రశ్నించారు. వరద బాధితులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ఖమ్మం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. గతంలో దురదృష్టవశాత్తు వచ్చిన వరదలు, విపత్తులను కేసీఆర్ సర్కార్ సమర్థవంతంగా ఎదుర్కొందని వివరించారు. ఆపదలో ప్రజలకు అండగా లేని దద్దమ్మ ప్రభుత్వం అని అన్నారు. ప్రజల దృష్టి మరల్చడానికి కాంగ్రెస్ దాడులకు పాల్పడుతుందని ధ్వజమెత్తారు.

## ఆర్‌బీఐ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు

కేయూ క్యాంపస్ : రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆధ్వర్యంలో జాతీయస్థాయి ఆర్‌బీఐ 90 క్విజ్ పోటీలను నిర్వహించనుండగా దీనికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను మంగళవారం కేయూలో రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్‌బీఐకి చెందిన వరంగల్ ఆఫీసర్ మహ్మద్ అలీబాబా మాట్లాడుతూ ఈ క్విజ్ మొత్తం జాతీయ స్థాయిలో నాలుగు రౌండ్లు ఉంటాయని తెలిపారు. మొదటి రౌండ్‌లో ప్రతిభ చూపిన టీంలు రెండో రౌండ్‌లో ఆఫ్‌లైన్‌లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రస్థాయిలో అత్యంత ప్రతిభ చూపిన టీంలకు మూడో రౌండ్ జోనల్‌స్థాయిలో పోటీలు ఉంటాయని తెలిపారు. జోనల్‌స్థాయిలో ప్రతిభ చూపిన టీంలకు జాతీయ స్థాయిలో ఆఫ్‌లైన్‌లో పోటీలు ఉంటాయని తెలిపారు. జాతీయ స్థాయి విజేతలకు మొదటి బహుమతి రూ.10 లక్షలు, ద్వితీయ బహుమతి రూ.8లక్షలు, మూడో బహుమతి రూ.6 లక్షలు ఉంటుందని తెలిపారు యూనివర్సిటీల్లో, కళాశాలల్లో ప్రస్తుతం డిగ్రీ చదువుతున్న 25 ఏళ్ల లోపు విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తిగల వారు క్యూఆర్ కోడ్ ద్వారా ఇద్దరు టీంగా కూడా పేర్లను నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. పూర్తివివరాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఆర్‌బీఐ.ఓఆర్‌జీ.ఇన్‌లో చూసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు ఆఫీసర్లు హవేలి రాజు, రవి, ఫైనాన్షియల్ లిటరసీ క్రెడిట్ కౌన్సిలర్ భాస్కర్ పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

## భక్తిశ్రద్ధలతో నవరాత్రులు జరుపుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ తిరుపతి

- మామునూరు ఏసీపీ తిరుపతి

మామునూరు: శాంతియుతంగా పోలీస్ నిబంధనలు పాటిస్తూ భక్తిశ్రద్ధలతో గణేష్ నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవాలని మామునూరు ఏసీపీ తిరుపతి సూచించారు. వినాయక చవితి పండుగ సందర్భంగా మామునూరులోని హెచ్ఆర్ఎస్ గార్డెన్‌లో సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో జరిగిన పీస్ కమిటీ సమావేశంలో ఏసీపీ మాట్లాడారు. మండపాల నిర్వాహకులు పూర్తి వివరాలను నమోదు చేసుకోవాలని, దరఖాస్తు చేసుకున్న అనంతరం సంబంధిత స్టేషన్ పోలీస్ అధికారులు ఆన్‌లైన్ ద్వారా అనుమతులు జారీ చేస్తారని తెలిపారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా మండపాలను ఏర్పాటు చేసుకోవాలని, స్థల యజమానితో అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని విద్యుత్ శాఖ వారి అనుమతితోనే కనెక్షన్ తీసుకోవాలని సూచించారు. అసభ్యకరమైన నృత్యాలు చేయకూడదని తెలిపారు. సమావేశంలో సీఐ రవికుమార్, రాజగోపాల్, మండపాల నిర్వాహకులు తెలిపారు.

## ఫుట్‌బాల్ టోర్నీ నిర్వహణలో డీవైఎస్ఓ

వరంగల్ స్పోర్ట్స్: ఈ నెల 3 నుంచి 9 వరకు హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో జరగనున్న కాంటినెంటల్ ఫుట్‌బాల్ కప్ పోటీల నిర్వహణకు హనుమకొండ డీవైఎస్ఓ గుగులోత్ అశోక్‌కుమార్ పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహించనున్నారు. మారిషస్, సిరియా దేశాల జట్లు పాల్గొనే అంతర్జాతీయ ఫుట్‌బాల్ పోటీల్లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఎండీ ఆదేశాలతో శాట్ డీడీ చంద్రారెడ్డితో కలిసి క్రీడాకారులను స్టేడియంకు చేరవేయడం, టోర్నీ నిర్వహణ అధికారులు, ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ బాధ్యులకు వసతుల కల్పన లాంటివి అశోక్ పర్యవేక్షంచనున్నారు. డీవైఎస్ఓ భాగస్వామ్యుడు కావడంపై జిల్లా ఒలింపిక్స్ సంఘం, వివిధ క్రీడా సంఘాల బాధ్యులు, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



శాట్ డీడీ చంద్రారెడ్డితో కలిసి స్టేడియంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న డీవైఎస్ఓ అశోక్

## సంక్షిప్త సమాచారం

### వృద్ధురాలిని చేరదీసిన 108 సిబ్బంది



కాజీపేట: మండలంలోని సోమిడి గ్రామ శివారులోని పంట పొలాల్లో ఒంటరిగా ఉంటున్న ఓ వృద్ధురాలి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో 108 సిబ్బంది స్పందించి చేరదీసింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. ఓరుగంటి లక్ష్మి (75) భర్త ఐదేళ్ల క్రితం మృతి చెందగా కుటుంబ సభ్యుల సహకారంతో సోమిడి శివారులో ఓ ఇల్లు నిర్మించుకుని ఉంటుంది. రెండు, మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో బయటకు రాలేదు. లక్ష్మి బయట కనిపించకపోవడంతో అనుమానం వచ్చిన కాలనీవాసులు పోలీసులకు సమాచారం అందించగా తలుపులు తెరిచి చూడగా స్పృహ తప్పిపోయి కనిపించడంతో 108 సిబ్బందికి సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

### 108 వాహనంలో మహిళ ప్రసవం

ఖిలా వరంగల్: వరంగల్ ఎస్ఆర్ఆర్ తోటకు చెందిన నడిగొండ దివ్య (28) పురిటినొప్పులతో బాధపడుతోంది. వాహనంలో ఆమెకు నొప్పులు అధికం కావడంతో 108 సిబ్బంది ప్రసవం చేశారు. ఆ మహిళ పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారు. వెంటనే సీకేఎం ప్రసూతి ఆస్పత్రికి తరలించారు. 108 సిబ్బందిని అభినందించారు.

### చిరువ్యాపారులు లైసెన్స్‌లు తీసుకోవాలి

వరంగల్ అర్బన్ : వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలో చిరు ఆహార పదార్థాల వ్యాపారులందరూ ఆహార పరిరక్షణ కోసం (ఎఫ్ఎస్ఎస్ఏఐ) రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా కలిగి ఉండాలని వరంగల్ జిల్లా ఆహార పరిరక్షణ అధికారి కృష్ణమూర్తి తెలిపారు. ఈ నెల 5లోగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు బల్దియా ప్రధాన కార్యాలయంలో మెప్మా భవన్‌లో ఆధార్‌కార్డు జిరాక్స్, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, వ్యాపార ఫొటో అందచేయాలని కోరారు.

### 27, 28వ తేదీల్లో జాతీయ సదస్సు

కేయూ క్యాంపస్ : హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా కళాశాలలో ఈనెల 27, 28వ తేదీల్లో చరిత్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించబోయే రెండు రోజుల జాతీయ సదస్సు పోస్టర్‌ను మంగళవారం కేయూ హిస్టరీ విభాగంలో ఆవిష్కరించారు. సోషల్ సైన్స్ డీన్ ఆచార్య టి.మనోహర్, ఆ విభాగం అధిపతి డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్, విశ్రాంత ఆచార్యులు కె.విజయబాబు, తెలుగు యూనివర్సిటీ డీన్ వెంకన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### అభిరుచిని పెంపొందించేందుకు స్కాలర్‌షిప్

హన్మకొండ: పోస్టల్ స్టాంపుల అభిరుచిని పెంపొందించేందుకు ప్రభుత్వం, పోస్టల్‌శాఖ ప్రత్యేకంగా దీన్‌దయాల్ స్పర్శ్ యోజన స్కాలర్‌షిప్ అందిస్తుందని తపాలాశాఖ హనుమకొండ డివిజన్ సూపరింటెండెంట్ హనుమంతు తెలిపారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఈ స్కాలర్‌షిపులు అందించనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 13లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం ఇండియా పోస్టు డాట్ గోవ్ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో సంప్రదించాలని కోరారు.

### భద్రునాయక్ సేవలు మరువలేనివి

విద్యారణ్యపురి: కాకతీయ యూనివర్సిటీ హిస్టరీ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్ విభాగం ప్రొఫెసర్, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ గుగులోతు భద్రునాయక్ అందించిన సేవలు మరువలేనివని హిస్టరీ విభాగం అధ్యాపకులు అన్నారు. భద్రునాయక్ మృతికి సంతాపకంగా మంగళవారం కేయూలోని హిస్టరీ విభాగంలో ఆ విభాగం అధిపతి డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్, సోషల్ సైన్స్ డీన్ హిస్టరీ విభాగం ప్రొఫెసర్ టి మనోహర్, అధ్యాపకులు డాక్టర్ బ్రహ్మం, కె వీఎస్ నరేందర్, శ్రీధర్, ఎం కె సుమంత్, నాగేశ్వర్‌రావు శంకర్, విద్యార్థులు సమావేశమై మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు.

### నోట్‌బుక్స్ పంపిణీ



కాశిబుగ్గ : కందకట్ల వశిష్ట దత్త రెండో జన్మదినాన్ని పురస్కరించుకుని తాత, నానమ్మలు కందకట్ల రాంప్రసాద్, వైదేహిలు శివనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సుమారు రూ. 20 వేల విలువైన నోట్‌బుక్స్, బిస్కెట్లు మంగళవారం పంపిణీ చేశారు. హెచ్ఎం విజయకుమార్, ఉన్నత పాఠశాల హెచ్ఎం గంగా శ్రవణ్‌కుమార్, గుమ్మడవెల్లి సురేశ్, రజిని తదితరులు పాల్గొన్నారు.

### మట్టి వినాయకులనే పూజించాలి



హన్మకొండ: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో మట్టి ప్రతిమలనే పూజించాలని సామాజికవేత్త, పర్యావరణ ప్రేమికుడు నిమ్మల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండలోని సెయింట్ పీటర్స్ పబ్లిక్ స్కూల్‌లో మట్టి వినాయక ప్రతిమలను పూజించాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. మట్టి ప్రతిమల సమాచారానికై 9949 709866 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

### నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

కాజీపేట : ప్రభుత్వం రూపొందించిన నూతన చట్టాలపై మహిళలు ప్రత్యేక అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత అన్నారు. 61వ డివిజన్ సిద్ధార్థనగర్ ప్రభుత్వ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం సఖి వన్‌స్టాప్ సెంటర్, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా శిశు సంక్షేమ శాఖలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన మహిళల సమావేశంలో చట్టాలపై అవగాహన కల్పించారు

### భాషా పరిజ్ఞానాన్ని పెంపొందించాలి

ఖిలా వరంగల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు భాషా పరిజ్ఞానం, ఏకాగ్రత, మేథోశక్తి పెంపొందించేలా కార్యక్రమాలు చేపట్టాలని సెక్టార్ సూపర్‌వైజర్స్ రమాదేవి, ఆశాదేవి సూచించారు. మంగళవారం ఉర్సు కరీమాబాద్, పెరకవాడలోని అంగనవాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ ఆధికారుల ఆధ్వర్యంలో వేర్వేరుగా మాసోత్సవ ఉత్సవాలను నిర్వహించారు.

### శాస్త్రీయ విద్యాసాధనే ధ్యేయంగా ఉద్యమాలు

విద్యారణ్యపురి: విప్లవ విద్యార్థి అమరుల పోరాటాల స్ఫూర్తితో శాస్త్రీయ విద్యాసాధనే ధ్యేయంగా విద్యార్థి ఉద్యమాలను ఉధృతం చేస్తామని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నర్సింహారావు విద్యార్థులకు పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండలోని అశోక సెంటర్‌లో పీడీఎస్‌యూ 50వ వార్షికోత్సవ సభలను అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో జరపాలని ఆయన కోరారు. ఈ మేరకు రూపొందించిన వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. పీడీఎస్‌యూ గ్రేటర్ వరంగల్ నగర కమిటీ నాయకులు రవి, అభిషేక్, అఖిల్, కె.కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

### నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

ఖిలా వరంగల్ : కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్ విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్, నైపుణ్యాలను పెంపొందించుకుంటే ఉద్యోగాలు సులభంగా లభిస్తాయని వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కె.ప్రకాశ్ అన్నారు. మంగళవారం బొల్లికుంట వాగ్దేవి కళాశాలలో అధ్యాపకుల ఆధ్వర్యంలో కంప్యూటర్ సైన్స్, ఇంజనీరిగ్ విద్యార్థులకు భవిష్యత్‌లో రాబోయే ఉద్యోగాలపై అవగాహన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు.

### ఘనంగా బొడ్రాయి వార్షికోత్సవం

వరంగల్ చౌరస్తా : వరంగల్ గిర్మాజీపేట 27 కూరగాయల మార్కెట్‌కు సమీపంలోని బొడ్రాయి 14వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గోపాల నవీన్‌రాజు, మీసాల ప్రకాశ్, స్థానిక కార్పొరేటర్ చింతాకుల సునీల్, నాయకులు చింతాకుల అనిల్, తదితరులు పాల్గొన్నారు.

### గణనాథుడికి నది జలాలతో అభిషేకం



కాజీపేట: కాజీపేట స్వయంభు శ్రీశ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో మంగళవారం సిద్ధి, బుద్ధి సమేత గణపతికి నది జలాలతో సహస్రధారలతో అర్చకులు అభిషేకం నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు అయినవోలు రాధాకృష్ణ శర్మ ఆధ్వర్యంలో కాళేశ్వరంలోని త్రివేణి సంగమం నుంచి తెచ్చిన గోదావరి జలాలతో అభిషేకం జరిపించారు. భక్తులకు ఆలయంలోని అన్నపూర్ణ భవనంలో అన్నదానం చేశారు.

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కాశిబుగ్గ : వరదలు తగ్గడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని 35వ డివిజన్ కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్ సూచించారు. గత మూడు రోజులుగా జలదిగ్బంధలో ఉన్న మైసయ్యనగర్ మంగళవారం వరద నుంచి బయటపడింది. కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది పర్యటించి పేరుకపోయిన చెత్త చెదారాన్ని తొలగించి బ్లీచింగ్ చేశారు. చింతల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు దిలీప్ వైద్యశిబిరం ఏర్పాటు చేసి వైద్యపరీక్షలు చేశారు.

### వెయిట్ లిఫ్టింగ్‌లో దేవేందర్‌కు కాంస్య పతకం




కాజీపేట : ఇటీవల ముగిసిన పదో తెలంగాణ రాష్ట్ర పురుషులు, మహిళల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో హనుమకొండ జిల్లాకు చెందిన డి.దేవేందర్ 73 కిలోల కేటగిరిలో కాంస్య పతకం సాధించాడు. ఈ పోటీలకు మండలోజు కృష్ణమూర్తి, శ్రీపాద శ్రీనివాసులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. దేవేందర్‌ను జిల్లా కమిటీ, కుటుంబ సభ్యులు అభినందించారు.

### సమస్యలు తలెత్తకుండా చూడాలి

కాజీపేట : వరదల కారణంగా తలెత్తిన సమస్యలను వెంటనే పరిష్కరించడానికి అధికారులకు తగిన ఆదేశాలను జారీ చేయాలని సీపీఐ మండల కార్యదర్శి మునిగాల భిక్షపతి డిమాండ్ చేశారు. 63వ డివిజన్ ఏఆర్ఆర్ నగర్ కాలనీలో మంగళవారం ఆయన మాట్లాడుతూ మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారడం బాధాకరమన్నారు.

### రైల్వేట్రాక్ మరమ్మతులో కాజీపేట సిబ్బంది

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ నుంచి రైల్వే ఇంజనీరింగ్, మెడికల్, ఎలక్ట్రిక్ తదితర డిపార్ట్‌మెంట్ సిబ్బంది మంగళవారం ఇంటికన్నె-కేసముద్రం రైల్వేట్రాక్ మరమ్మతు పనుల్లో పాల్గొన్నారు. రైల్వే డీఆర్ఎం భర్తీష్‌కుమార్ జైన్ పర్యవేక్షణలో సుమారు 500 మంది రైల్వే సిబ్బంది మరమ్మతులో పాల్గొని పనులు చేస్తునట్లు కాజీపేట అధికారులు తెలిపారు. కాజీపేట రైల్వే మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిరంజన్‌రావు ఆధ్వర్యంలో డాక్టర్ కె.వినయ్‌బాబు, చీఫ్ ఫార్మసిస్ట్ చింత తిరుపతి, డ్రెసర్ జి.శ్రీనివాస్, అటెండర్ కబిగాడ్‌లు కార్మికులకు ప్రాథమిక చికిత్స చేసినట్లు అధికారులు తెలిపారు.

### అంబేద్కర్ స్టడీ సెంటర్ డైరెక్టర్‌గా శంకరయ్య



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ అంబేద్కర్ స్టడీసెంటర్ డైరెక్టర్‌గా తెలుగు విభాగానికి చెందిన కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ మంథిని శంకరయ్య నియమితులయ్యారు. ఈ మేరకు కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో, ప్రస్తుతం క్యాంపస్‌లోని తెలుగు విభాగంలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న శంకరయ్య ఇటీవల కొంతకాలం పాటు తెలుగు విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. మంగళవారం సాయంత్రం నియామక ఉత్తర్వులను రిజిస్ట్రార్ శంకరయ్యకు అందజేశారు. డాక్టర్ రాజ్‌కుమార్ నుంచి శంకరయ్య బుధవారం బాధ్యతలు స్వీకరిస్తారు.

### 'విశ్వకర్మ యోజన' పోర్టల్‌ను పునరుద్ధరించాలి



వరంగల్ : తెలంగాణ రాష్ట్రంలో సాంకేతిక లోపంతో ఆన్‌లైన్‌లో విశ్వకర్మ యోజన పథకం పోర్టల్ రావడం లేదని వెంటనే వరంగల్, హనుమకొండ జిల్లాల్లో పునరుద్ధరించాలని బీజేపీ వరంగల్ జిల్లా అధికార ప్రతినిధి ఆడెపు వెంకటేశ్ కోరారు. మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 కులాలకు సంబంధించిన ఈ పథకం ఎంతోమందికి ఆసరాగా నిలుస్తుందన్నారు.

### వైద్యశిబిరాలు నిర్వహించాలి : ఏబీఎస్ఎఫ్

వరంగల్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యశిబిరాలు నిర్వహించాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్, స్వేరోస్ జిల్లా మాజీ అధ్యక్షుడు శనిగరపు రాజేంద్రప్రసాద్ కోరారు. అర్హత లేకుండా వైద్యం చేస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలపై చర్యలు తీసుకోవాలని, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ధరలను నియంత్రించాలని పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణికి వారు వినతిపత్రం సమర్పించి మాట్లాడారు. భారీ వర్షాలతో ప్రజలు వ్యాధులబారిన పడుతున్నారని తెలిపారు. ప్రతి గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించాలని వారు విజ్ఞప్తి చేశారు.

### బాలగణేశ్‌కు 1500 కిలోల లడ్డూ

నయీంనగర్: వరంగల్ నగరంలో మునుపెన్నడూ లేనివిధంగా 1500 కిలోల లడ్డూను తయారు చేయించి బాలగణేశ్‌కు నైవేద్యంగా సమర్పించనున్నట్లు వారాహి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు క్రాంతికుమార్ తెలిపారు. హనుమకొండలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వరంగల్ పాపయ్యపేట చమన్‌లో ఏర్పాటుచేయనున్న బాలగణేశ్‌తోపాటు భారీ లడ్డూను భక్తులు వీక్షించాలని కోరారు. సమావేశంలో ట్రస్ట్ కోశాధికారి పూర్ణచందర్ పాల్గొన్నారు.

### యాజమాన్య పద్ధతులు పాటించాలి

మామునూరు: అధిక వర్షాలకు పంటలకు నష్టం వాటిల్లకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ రాజన్న సూచించారు. ఈమేరకు మంగళవారం వరంగల్ జిల్లాలోని చెన్నారావుపేట, నెక్కొండ, రాయపర్తి, సంగెం, వర్ధన్నపేట, ఖిలా వరంగల్ మండలాల్లో కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పర్యటించారు. ఈ సందర్భంగా వర్షాలతో దెబ్బతిన్న పత్తి, వరి, మొక్కజొన్న పంటలను వారు పరిశీలించారు. అనంతరం రాజన్న మాట్లాడుతూ పంటల సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని కోరారు.